విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఖాలేదా నసీం రాజీనామా

విశాలాంధ్ర-తెనాలి : మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఖాలేదా నసీం తన ఛైర్‌పర్సన్ పదవికి రాజీ నామా చేశారు. గురువారం లేఖను కమిషనర్ జశ్వంతరావుకు సమర్పించారు. తన రాజీనామాకు తన వ్యక్తిగత కారణాలేనని చెబుతూ, 21వ వార్డులో కౌన్సిలర్‌గా కొనసాగుతానని తెలిపారు. తాము ఎల్లప్పుడూ వైకాపా వెంటనే ఉంటామని పార్టీ విజయానికి ఎప్పటిలాగానే కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రస్తుతం వైస్‌ఛైర్మన్‌గా వున్న మాలేపాటి హరిప్రసాద్ ఛైర్మన్‌గా మరల ఛైర్మన్ ఎన్నిక జరిగేవరకు బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు. డిఎంఎ ద్వారా ఎన్నికల కమీషన్‌కు మున్సిపల్ అధికారులకు తెలియజేస్తారని ఆ ప్రకారం తదుపరి ప్రక్రియలు జరుగుతాయని తెలిపారు.

సైన్స్ సబ్జెక్టుల ద్వారా 'భావి శాస్త్రవేత్తలు'

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పాఠశాల స్థాయిలో విద్యార్థులు సామాన్య, భౌతిక, రసాయన శాస్త్రాల సబ్జెక్టులపై పట్టు సాధించటం ద్వారా 'భవిష్యత్తు శాస్త్రవేత్తలు'గా రాణించవచ్చునని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడి, టెక్నో పాఠశాలలో మూడవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు సామాన్య, భౌతిక, రసాయన శాస్త్రాల సబ్జెక్టులపై అకాడమిక్ డయాగ్రమ్స్‌పై మోడల్స్ పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చక్ర నాగ్ మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్‌తో పాటు ఇతర సబ్జెక్టుల్లో పోటీతత్వం ఉండటం వల్ల వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయునిలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య హైస్కూల్‌లో 'బీ హెల్తీ-బీ హ్యాపీ'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక చెంచుపేటలోని శ్రీ చైతన్య హైస్కూల్ నందు ప్రతి నెల స్మార్ట్ లివింగ్ షో కార్యక్రమంలో భాగంగా 'బీ హెల్తీ-బీ హ్యాపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిరి డెంటల్ క్లినిక్ వారు శ్రీచైతన్య హైస్కూల్ నందు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచిత దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ కె.మాధురి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థుల్లో నైతిక, ఆరోగ్య విలువలు పెంపొందించుటకు బీ హెల్తీ-బీ హ్యాపీ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఆర్ఐ అప్పాజీ, సీ-ఇన్‌ఛార్జ్ భగత్, డీన్ రవిబాబు, ఏఓ గోపీచంద్, కో-ఆర్డినేటర్ పి.గోపీచంద్ తదితరులు ఉన్నారు.

ఫోక్సో కేసు నమోదు

విశాలాంధ్ర-పొన్నూరు: పట్టణంలోని సిద్ధి వినాయక నగర్‌కు చెందిన 11 సంవత్సరాల మైనర్ బాలికపై అదే కాలనీకి చెందిన 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక కుటుంబ సభ్యులతో కలిసి పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అర్బన్ సీఐ అల్తాఫ్ హుస్సేన్ ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

మిరప పంటలో తామర పురుగుల దాడిని తిప్పికొట్టే ఉత్పత్తులను ఉపయోగించండి

గుంటూరు: గత సంవత్సరం భారతదేశంలోని దక్షిణాది రాష్ట్రాలలో 50-80 శాతం మిరప పంటలను ప్రభావితం చేసినది తామర పురుగు (త్రిప్స్). రసం పీల్చే కీటకాల్లో అతి ముఖ్యమైన గ్రూప్ లలో ఈ త్రిప్స్ ఒకటి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని మిర్చి రైతులకు సంభావ్య ముప్పుగా ఇది కొనసాగుతోంది. ప్రపంచ మిర్చి ఉత్పత్తిలో భారతదేశం దాదాపు 36 శాతం వాటాను కలిగి ఉన్నందున, త్రిప్ పై సమర్ధవంతంగా పనిచేసే ఉత్పత్తులను వాడడం ద్వారా పంటను తెగుళ్లు, కీటకాల నుండి రక్షించడం చాలా ముఖ్యం. "ఈ త్రిప్‌లు ప్రధానంగా ఆకుల దిగువ భాగం, పువ్వుల వంటి పునరుత్పత్తి భాగాలు వద్ద ఎక్కువగా కనిపిస్తుంటాయి. మిర్చి పంటను అన్ని రకాల నేలల్లో, వివిధ వాతావరణ పరిస్థితులలో సాగు చేస్తున్నందున, రైతులు తమ పంటల సమర్ధవంతమైన నిర్వహణ కోసం పంటకు సంబంధించి వివిధ దశలో త్రిప్స్ యొక్క సంభవం, వాటి సంఖ్యను పర్యవేక్షించడం తప్పనిసరి" అని గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె అన్నారు.

కంతేరులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-తాడికొండ : మండల పరిధిలోని కంతేరు గ్రామ హైస్కూల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. బీపీ, షుగర్, నరాలు, జలుబు, దగ్గు, తలనొప్పి, చర్మవ్యాధులు, గుండె మొదలైన వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త కత్తెరసురేష్ కుమార్ మాట్లాడారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అందరూ ఆరోగ్యంగా సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి, సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ కె.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పిరెడ్డితో కత్తెర దంపతుల సమావేశం

విశాలాంధ్ర-తాడికొండ : శాసనమండలి విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సమావేశంలో పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. ఈ సందర్భంగా శాసనమండలి విప్‌గా ఎన్నికైన అప్పిరెడ్డిని కత్తెర దంపతులు, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఇటీవల స్వల్ప అస్వస్థకు గురైన కత్తెర సురేష్ కుమార్‌ను అప్పిరెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపాలి

విశాలాంధ్ర-పెదకాకాని : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపటాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల పిలుపుమేరకు పెదకాకాని సెంటర్‌లో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ కరెంట్ చార్జీలపై మాట మార్చిన జగన్‌ను ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ప్రజలు జగన్‌కు కరెంట్ షాక్ ఇచ్చి గద్దె దింపి ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. గత ఎన్నికలకు ముందు అధికారం ఇవ్వండి విద్యుత్ చార్జీలు పెంచనని అధికారంలోకి రాగానే మడమ తిప్పారని, దీంతో కరెంట్ భారాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీలు ప్రతినెల క్రమక్రమంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందుల ఎపడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని విద్యుత్ దోపిడీ సాగిస్తున్నాయని అన్నారు. 15న అజాద్ చౌక్ వద్ద జరిగే ప్రజా బ్యాలెట్‌కు అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా నాయకులు తాటిపాక మధు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వరావు, కె.జోజి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు రైతులు, వినియోగదారుల పాలిట ఉరితాళ్ళుగా మారయని అన్నారు. ముందుగానే విద్యుత్ బిల్లులు చెల్లించే ప్రీపెయిడ్ విధానం ప్రవేశపెడుతున్నారని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, వెనిగండ్ల సీపీఐ కార్యదర్శి బుల్ల బాబురావు, బి.వీరయ్య, ఆర్.మోజెస్ బాబు, సిహెచ్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి బిల్డర్లు ముందుకు రావాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరాభివృద్ధికి బిల్డర్లు ముందుకు రావాలని, బిల్డర్స్ సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ నుండి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ తొలుత బిల్డర్స్ సమస్యలు, నగరపాలక సంస్థ తరుపున అందించాల్సిన సహకారంపై అడిగి తెలుసుకొని మాట్లాడుతూ నగరాభివృద్ధిలో బిల్డర్స్ కూడా భాగస్వాములు కావాలని, ప్రభుత్వ నిర్దేశిత పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. భవన నిర్మాణ ప్లాన్ కోసం దరఖాస్తు చేసే సమయంలోనే నిబంధనల మేరకు పన్నులు చెల్లించడం, ప్లాన్ ప్రకారం నిర్మాణం చేపట్టడం చేయాలన్నారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ దరఖాస్తుకి ముందే రెవెన్యూ విభాగం నుంచి సదరు భవనానికి సంబందించి ఖాళీ స్థల పన్ను, ఇతర పన్నులపై ఎన్‌ఓసి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్యుపెన్సీ, మార్ట్ గేజి విడుదల జాప్యం లేకుండా ఆన్ లైన్ ద్వారా వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటి ప్లానర్ మహా పాత్రో, నరేడ్కో క్యాపిటల్ జోన్ ప్రతినిధులు వి.శ్రీనాద్, సీతారామయ్య, సురేష్, దుర్గా ప్రసాద్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గత ప్రభుత్వ హయాంలో ఎనిమిదిన్నర లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి ఉన్న టిడ్కో ఇళ్లను ఇంతవరకు ఇవ్వకపోవడం, ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇప్పటికీ జీతాలు ఇవ్వలేని సీఎం అసమర్ధ పాలనకు నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న కాలనీలు కట్టిస్తాం అని హామీలు గుప్పించిన ముఖ్యమంత్రి పేదలను నిట్టనిలువునా ముంచారు. కోట్లాది రూపాయలు ప్రజా ధనాన్ని వృధా చేయడానికి రాజధాని విశాఖ పేరుతో దసరా నుంచి పాలన సాగిస్తారని అనడం చూస్తే సిగ్గుపడాల్సి వస్తుందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, మీరు ఇలా ఇష్టానుసారంగా మాట్లాడితే మీ కుటుంబ సభ్యులపై కూడా మాట్లాడాల్సి వస్తుందని హెచ్చరించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజమాష్టారు, కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులపై దయ కలిగి ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రతిఒక్కరూ వృద్ధుల పట్ల దయ, ప్రేమ కలిగి ఉండాలని సహృదయ ఫౌండేషన్ సభ్యులు ఎన్నారై తాడివాక బిందు మాధవి అన్నా రు. గురువారం స్థానిక వెంకటాద్రిపేట లోని కొత్తపేట మహిళా మండలి వృద్ధాశ్రమంలో ఆమె వృద్ధులకు మంచాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరికి బాల్యం ఎటువంటిదో వృద్ధాప్యం కూడా అటువంటిదేనని, పసిపిల్లల పట్ల ఎలా అయితే దయ, ప్రేమ కలిగి ఉంటామో అలానే వృద్ధుల పట్ల కలిగి ఉండాలని సూచించారు. విజయవాడ అభ్యుదయ మహిళా మండలి వారి చేతుల మీదగా 25 మంచాలను వృద్ధులకు అందజేశారు. డాక్టర్ సంధ్య రాణి వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు మంగమ్మ, సూపరింటెండెంట్ నాగమణి, శామ్యూల్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అక్రమ కేసులకు భయపడేది లేదు

విశాలాంధ్ర-గుంటూరు : ఓటమి భయంతోనే సీఎం జగన్ వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని చంద్ర బాబు నాయుడుపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారని తెలుగుదేశం పార్టీ గుం టూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మండిపడ్డారు. గురువారం అర్బన్ పార్టీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్‌రింగ్ రోడ్, ఫైబర్ గ్రిడ్ అంటూ ఒక దాని తర్వాత మరో కేసు పెడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేశారు, కానీ జగన్ రాజకీయ కక్షతోనే దాన్ని నిర్వీర్యం చేసి యువ తకు ఉపాధి లేకుండా చేశారన్నారు. డబ్బు ఎంతో తెలియకుండా, ఎవరి ఖాతాల్లోకి వెళ్లిందో తేలకుండా, చంద్రబాబు తప్పు చేశాడని ఎలా అంటారు? ఇందులో ఎలాంటి అవినీతి జరగ కున్నా.. కేవలం రాజకీయ కక్ష, దురాలోచనతోనే అక్రమ కేసులు మోపుతున్నారని అన్నారు. వ్యవస్థల్ని మ్యానేజ్ చేసి చంద్రబాబు నాయుడికి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. వైసీపీ పాలనలో నేరస్తులు బయట తిరుగుతున్నారు, నిరపరాధులు చెరసాలలో ఉంటున్నారన్నారు. అరాచక పాలనకు కాలం చెల్లిందని హెచ్చరించారు.

నడకే అన్ని జబ్బులకు మందు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం, నడకే దాదాపు అన్ని జబ్బులకు మందు అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి పేర్కొన్నారు. వరల్డ్ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐఎంఏ గుంటూరు బ్రాంచ్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ నందు ఆర్థరైటిస్ పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఐఎంఎ గుంటూరు బ్రాంచి అధ్యక్షులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు ప్రారంభించారు. వాకర్స్‌తో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా బిఎండి మిషన్ ద్వారా ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. అనంతరం ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎముకల పరిపుష్టికి కాల్షియం ఆధారిత ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కృత్రిమమైన ఫుడ్ సప్లిమెంట్స్ కన్నా ప్రకృతి పరంగా లభించే సహజ ఆహారాన్ని తీసుకుంటే మంచిదన్నారు. రోజువారీ నడకతో మానసిక దృఢత్వాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ టెక్స్టైల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో పోటీ చేస్తా: సుచరిత

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైసీపీ తరపున పోటీ చేస్తానని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, మాజీ హెూం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. ప్రత్తిపాడు నియోజక వర్గ ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా చెక్‌లను స్థానిక బ్రాడీపేటలోని ఆమె కార్యాలయంలో పంపిణీ చేస్తూ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పుకార్లు షికార్లు చేస్తున్న కారణంగా వాటికి సుచరిత ఫుల్‌స్టాప్ పెట్టారు. 26 నుంచి బస్సు యాత్ర చేపడుతున్నామని చెప్పారు. బస్సు యాత్ర ద్వారా ప్రజలకు చేరువగా ఉంటామని అన్నారు. రాష్ట్రంలో 175 నియోజక వర్గాల్లో వైసీపీ విజయకేతనం ఎగురవేసే దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రానున్న ఎన్నికల్లో విజయం తధ్యం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి పక్షాలు ప్రజలు తరపున ఉండాలి కాని ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలం వెళ్ళదీస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు.

యువకుడి చేయి కాపాడిన లలితా హాస్పిటల్ వైద్యులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ట్రాక్టర్ డ్రైవర్ (42 సంవత్సరాలు)సెప్టెంబర్ 21వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. ఈ ప్రమాదంలో కుడి చేతికి గాయం అయ్యింది. దీంతో చెయ్యి నీలిరంగుకు మారి తిమ్మిర్లు రావడం ప్రారంభమైయ్యాయి. మోచేయి, మణికట్టు వద్ద ఎటువంటి నాడీ తెలియని పరిస్థితి నెలకొంది. అప్పుడు వైద్య సేవలు నిమిత్తం ప్రమాద బాధితుని కుటుంబ సభ్యులు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. దీంతో హాస్పిటల్ వైద్యులు అతడిని పరీక్షించగా కుడి చేతికి రక్తాన్ని సరఫరా చేసే ధమని (రక్తనాళం)పూర్తిగా తెగిపోయినట్లు గుర్తించారు. ఆ తరువాత లలితా హాస్పిటల్స్ వ్యాస్క్యులర్ సర్జరీ బృందమైన చీఫ్ కార్డియోథొరాసిక్, వ్యాస్క్యులర్ సర్జన్ డాక్టర్ అవినాష్, చీఫ్ ఎండోవ్యాస్క్యులర్ ఇంటర్వెన్షన్ డాక్టర్ అనురాగ్ పోలవరపు, సిటీవీఎస్ సర్జన్ డాక్టర్ రవికుమార్, మత్తు వైద్యులు డాక్టర్ కె.ఆనంద్‌బాబు, డాక్టర్ సునీల్ నంద కాలు నుంచి సిరను ఉపయోగించి ఎమర్జెన్సీ వ్యాస్క్యులర్ రీకన్‌స్ట్రక్షన్ సర్జరీ చేశారు. దీంతో పేషంట్ తన కుడి చేతితో మునుపటి లాగా అన్ని పనులు చేసుకోగలుగుతున్నారు. తన చేతితో పాటు తన కుటుంబ భవిష్యత్తును కూడా కాపాడినందుకు లలితా హాస్పిటల్స్ వైద్యులకు ఆ పేషంట్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రముఖ సాహితీవేత్త వేంకటరత్నానికి తృతీయ బహుమతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త చిటిప్రోలు వేంకటరత్నంకు మండలి ఫౌండేషన్ వారు తెలుగు జాతి గొప్పదనం గురించిన గీత రచనలో అంతర్జాతీయంగా నిర్వహించిన పోటీలో ఆయనకు తృతీయ బహుమతి లభించింది. వేంకటరత్నం ఇప్పటి వరకు మధర్ థెరిస్సా జీవిత చరిత్ర అనువాద గ్రంథమైన 'అమ్మకథ'తో సహా 7గ్రంథలు ప్రచురించారు. వీటిలో రెండు నాటకాలున్నాయి. మూడో నాటకం ప్రచురణలో ఉంది. కవితా సంపుటి, వ్యాస సంపుటి, విమర్శ గ్రంథం వంటివి విభిన్న ప్రక్రియలలో గేయ, వచన గేయ, గీత, పద్యాలు రాసిన వేంకటరత్నం ఇప్పటి వరకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయ సాహితీ పురస్కారంతో సహా 8 పురస్కారాలు పొందారు. ఛారిత్రక ప్రాధాన్యం గల పలనాటిలోని నాయకురాలు నాగమ్మ ఊరు గామాలపాడు వీరి స్వగ్రామం. వీరి తండ్రి చిటిప్రోలు కృష్ణమూర్తి అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ బీరం సుందరరావులు వేంకటరత్నానికి అభినందనలు తెలియజేశారు.

సొంతింటి కల నెరవేరిన వేళ...

విశాలాంధ్ర-మేడికొండూరు: పేద బడుగు బలహీన వర్గాలకు సొంతింటి కల నెరవేరిందని జిల్లా పరిషత్ చైర్పర్సన్ హెని క్రిస్టినా అన్నారు. మేడికొండూరు మండలం పేరేచర్ల గ్రామ సచివాలయం-3లో గురువారం జగ నన్న గృహప్రవేశాల కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఉద్దేశించి క్రిస్టినా మాట్లాడుతూ పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్ష మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికే ఇరవై రెండు లక్షలు ఇల్లు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ఏడు లక్షల 40 వేల గృహాలు పూర్తి అవటం జరిగిందని, గుంటూరు జిల్లాలో 30 వేల గృహాలు పూర్తి చేయటం జరిగిందని గుర్తు చేశారు. వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అర్హత ఉండి లబ్ధి పొందని వారికోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని తద్వారా 11 రకాల సర్టిఫికెట్లను మంజూరు చేయటం జరిగిందన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పి రెడ్డి మాట్లాడుతూ పేదల తలరాతలను మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కంకణం కట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ కె స్వాతి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, జడ్పిటిసి కందుల సిద్దయ్య , ఎంపీపీ మన్నవ స్వప్న, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

షాక్ కొడుతున్న కరెంటు చార్జీలు: జంగాల

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: విద్యుత్ బిల్లులు చూడగానే ప్రజలకు షాక్ కొడుతుందని జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రత్తిపాడు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ ఆటో స్టాండ్‌లో ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఆయన మాట్లాడారు. పెరిగిన బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారని, విద్యుత్తు వాడకం పెరగకపోయినా ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు చార్జీలు పేరుతో వెన్నుపోటు పొడిచిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు కరెంట్ షాక్ ఇస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘ కార్యదర్శి కొల్లి రంగారెడ్డి, ప్రత్తిపాడు సీపీఐ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎస్.అంజిబాబు, వెంకటరావు, సివిల్ సప్లై కార్మికులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలు

విశాలాంధ్ర-తెనాలి : నియోజక వర్గంలోని ఓటర్ వెరిఫికేషన్ 3 దశల్లో అక్రమాలపై విచారణ చేపట్టాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గురువారం సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు ఆధారాలతో సహా నివేదిక అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం 25 లక్షలకు పైగా దొంగ ఓట్లు చేర్పించిందని చెప్పారు. ఓటర్ లిస్టులో ఒకే కుటుంబంలో వాళ్ల ఓట్లు ఒకే బూతులో కాకుండా వేర్వేరు బూతుల్లో ఉండి తికమక కలిగిస్తూ ఓటర్లను భయభ్రాంతులు కలిగిస్తున్నారని ఓటర్ వేరిఫికేషన్ సమయంలో కొన్ని బూతుల బిఎల్వోలు కనీసం వెరిఫికేషన్‌కి రాకుండా వదిలేశారని అన్నారు. వెరిఫికేషన్ లేని దొంగ ఓట్ల సమస్యలు చాలా ఉన్నాయని వీటిపై విచారణ జరిపించాలని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కేఎల్‌యూలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని మహిళా ఉద్యోగులు, అధ్యాపకులకు కేఎల్ మహిళా అభివృద్ధి సెల్ ఆధ్వర్యంలో పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, క్యాన్సర్‌పై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈ రెండు సాధారణ ఆరోగ్య పరిస్థితుల గురించి, వాటిని ఎలా నివారించాలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి గుంటూరులోని కోమలి ఫెర్టిలిటీ సెంటర్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి శ్రీనాథ్ ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. పీసీఓడీలు, క్యాన్సర్ కారణాలు, లక్షణాలు చికిత్స గురించి వివరించారు. ఈ వ్యాధులను ముంద స్తుగా గుర్తించడంతో పాటు నివారించడం ప్రాముఖ్యమని అన్నారు. మహిళల ఆరోగ్యం, పీసీఓడీ, కేన్సర్‌పై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గాను కేఎల్ మహిళా అభివృద్ధి సెల్ కోఆర్డినేటర్లు డాక్టర్ రూత్ రమ్య, ఎస్.శ్రీలక్ష్మి, యూత్ రెడ్ క్రాస్ ప్రొఫెసర్ ఇంచార్జి డాక్టర్ కటారి సుకీర్తిలను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అభినందించారు.

హనుమంతరావు కుటుంబానికి అండగా ఉంటాం

విశాలాంధ్ర-చేబ్రోలు : మాజీ ఎంపీటీసీ సభ్యులు మైల హనుమంతరావు కుటుంబానికి అండగా ఉంటామని మాజీ శాసనసభ్యులు రావి వెంకటరమణ అన్నారు. మండల పరిధిలోని శుద్ధపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు హనుమంతరావు బుధవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రావి వెంకటరమణ హనుమంతరావు స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతరావు సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. హనుమంతరావు కుటుంబానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. ఆయన వెంట చేబ్రోలు మండల వైసీపీ మాజీ అధ్యక్షులు ఆళ్ల శ్రీరామ రెడ్డి, అన్నవరపు కృష్ణ చైతన్య, గేరా సుబ్బయ్య, భాష, వేముల శివపార్వతి, పురుషోత్తపట్నం గోకుల్ కృష్ణ, మనోజ్ సుభాని, మదన్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్‌ను సందర్శించిన తనిఖీ బృందం

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీను అబెట్(అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ) అక్రిడిటేషన్ ప్రాసెస్ కమిటీ బృందం తనిఖీ నిర్వహించింది. అమెరికా నుంచి వచ్చిన 11 మంది సభ్యులతో కూడిన తనిఖీ బృందం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు తనిఖీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో అబెట్ అక్రిడిటేషన్‌కు దరఖాస్తు చేసుకుని తనిఖీ పూర్తి చేసుకున్న మొట్టమొదటి యూనివర్సిటీ విజ్ఞాన్ అని తెలియజేసారు. తనిఖీ విజయవంతమై అబెట్ అక్రిడిటేషన్ సాధించినట్లయితే విదేశాలలో ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతాయని తెలియజేసారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

16న కౌలు రైతు సమస్యలపై ధర్నాలు: జమలయ్య

విశాలాంధ్ర-గుంటూరు : కౌలు రైతు సమస్యలపై ఈ నెల 16వ తేదిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తెలిపారు. కౌలుకు సాగు చేస్తున్న కౌలు రైతులందకి గుర్తింపుకార్డులు, పంటరుణాలు, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల భీమా పరిహారాలు ఇవ్వాలని కోరుతూ తలపెట్టిన ఈ ధర్నా కార్యక్రమాలలో పెద్దఎత్తున కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పంట సాగుదార్ల హక్కుల చట్టాన్ని సవరించి సులభంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. కౌలు గుర్తింపు కార్డులు లేకపోవడం వలన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు కౌలు రైతులకు అమలు జరగటం లేదన్నారు. ఆహార, వాణిజ్య, ఉద్యాన తదితర అన్ని పంటలను కౌలు రైతులే పండిస్తున్నారని, స్థానికంగా బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వనందున ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెడుతున్నారని చెప్పారు. పెట్టిన పెట్టుబడికి కనీస ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని, కౌలు రైతులందరికీ డబల్ ఫైనాన్స్‌తో సంబంధం లేకుండానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు అందజేయాలని కోరారు. సాగుదారులకు అందించే పెట్టుబడి సాయం రూ.13500లకు కూడా కౌలు రైతులు నోచుకోవడం లేదని, భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికి కొద్ది మందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదని అన్నారు. భూమిలేని సాగుదారులందరికి రైతు భరోసా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. గుర్తింపు కార్డులు లేవని ఇ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయకపోవటం వల్ల ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటలను అమ్ముకునే వేసులుబాటు కోల్పోయి తక్కువ ధరలకు అమ్ముకుని నష్టపోతున్నారని, ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించినప్పుడు ఎక్కువగా నష్టపోతున్నది కూడా కౌలురైతులేనని, వీరికి ఇన్‌పుట్ సబ్సిడీ గానీ, పంటల భీమా పరిహారాలు అందటం లేదని జమలయ్య అన్నారు. కౌలుగుర్తింపు కార్డులు పొందిన వారికి ఎటువంటి షూరిటీ లేకుండానే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని, భూమిలేని కౌలురైతులందరికీ రైతు భరోసా ఎకరానికి(పెట్టుబడి సాయం) రూ.10 వేలు ఇవ్వాలని, దురదృష్టవశాత్తు ఆత్మహత్య చేసుకున్న ప్రతి కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని, దేవాదాయ, ధర్మాదాయ శాఖ సాగుభూములను బహిరంగ వేలం వేసే విధానాన్ని రద్దు చేయాలని, తరతరాల నుంచి సాగు చేస్తున్న భూమిలేని పేదలకు యాజమాన్యం హక్కులు కల్పించాలని తదితర డిమాండ్ల సాధన కోసం జరిగే ధర్నాలో కౌలు రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుంటూరు జిల్లా సంఘం అధ్యక్షులు కె.విఠల్ రెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SITA DEVI YARLAGADDA (Old Name), W/o. INTURI SURESH, R/o. D.No.5-26, Guthavaripalem, Garlapadu Village, Kommuru Revenue, Kakumanu Mandal, Guntur District - 522235, Andhra Pradesh, have changed my name to **INTURI SEETHA DEVI**. Hereafter my name is known as **INTURI SEETHA DEVI**.

CHANGE OF NAME

I, **SHA DINESH JAIN** (Old Name), S/o. JOGRAJJI JAIN, R/o. Flat No.212, Kidambi Residency, R.Agraharam, Guntur - 522003, Guntur District, Andhra Pradesh, have changed my name to **DINESH JAIN**. Hereafter my name is known as **DINESH JAIN**.

muthoot HOUSING FINANCE

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముతూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం : యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఏ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 8&9 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 &9తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

వ. నం.	ఎల్ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ ఎకౌంట్ నెం.11204123971 1. జమ్ముల వెంకట శ్రీనివాసరావు, 2. జమ్ముల లత	26-జూన్-2023	12-జూన్-2023 నాటికి రూ.10,10,033.00/-	11-అక్టోబరు-2023

హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: షెడ్యూల్ నం.1: నర్సరావుపేట ఎస్ఆర్ఓ నందు రిజిస్టరైన గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నం. 8727/2012, తేదీ: 22-06-2012 ప్రకారం గుంటూరు జిల్లా, నర్సరావుపేట ఆర్.డి., నర్సరావుపేట సబ్ రిజిస్ట్రార్, నర్సరావుపేట మున్సిపల్ ఏరియా, బరంపేట్, చాకిరేవుమిట్ట యొక్క పడమరవైపు, ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర, నర్సరావుపేట మున్సిపల్ పాత వార్డ్ 1, కొత్త వార్డ్ 34, పాత సర్వే డి.నం.89, పట్టా నం.113, టి.ఎస్.నం. 9/2, డోర్ నం.1-6-107, అసెస్‌మెంట్ నం. 113, విస్తీర్ణం 86-46 చదరపు గజాలు, 700 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా గల ఆర్‌సీసీ దాబా. హద్దులు: ఉత్తరం: మున్సిపల్ బజార్ 10-5 అ॥లు, దక్షిణం: కోటి వీరాంజనేయులు స్థలం సొంత గోడ 64-9 అ॥లు, తూర్పు: మున్సిపల్ రోడ్డు 10-105 అ॥లు, పడమర: మందాడి వెంకటేశ్వర్లు సొంత గోడ - 21 అ॥లు. షెడ్యూల్ నం.2: నర్సరావుపేట ఎస్ఆర్ఓ నందు రిజిస్టరైన గిఫ్ట్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నం. 6084/2014, తేదీ: 01-07-2014 ప్రకారం గుంటూరు జిల్లా, నర్సరావుపేట ఆర్.డి., నర్సరావుపేట సబ్ రిజిస్ట్రార్, నర్సరావుపేట మున్సిపల్ ఏరియా, బరంపేట్, చాకిరేవుమిట్ట యొక్క పడమరవైపు, ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర, నర్సరావుపేట మున్సిపల్ పాత వార్డ్ 1, కొత్త వార్డ్ 34, పాత సర్వే డి.నం.89, పట్టా నం.113, టి.ఎస్.నం. 9/2, బ్లాక్ నం.1/1, హౌస్ నం.1-6-107 యొక్క ఉత్తర భాగం, అసెస్‌మెంట్ నం. 1024000107, విస్తీర్ణం: 63-9 చదరపు గజాలు, 700 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా గల ఆర్‌సీసీ దాబా. హద్దులు: ఉత్తరం: మున్సిపల్ బజార్ భూమి 52-9 అ॥లు, దక్షిణం: జమ్ముల లత భూమి 52-9 అ॥లు, తూర్పు: మున్సిపల్ రోడ్డు భూమి 10-105 అ॥లు, పడమర: జమ్ముల లత 10-105 అ॥లు.

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: గుంటూరు, తేదీ: 13 అక్టోబరు, 2023 సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వరుస చోరీలు.. జనం ఆందోళన

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామంలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన తిరువీధి రామాంజనేయులు తన హీరోహోండా బైకు (ఏపీ27ఆర్9319)ను బుధవారం రాత్రి ఇంటికి సమీపంలో ఉన్న పశువుల పాకలో పార్క్ చేశాడు. గురువారం ఉదయం చూసేసరికి పశువుల పాకలో పార్క్ చేసిన బైకు కనపడక పోవడంతో ఇరుగుపొరుగు వారిని ఆరా తీసినా తెలియదని చెప్పడంతో బైకు చోరీకి గురైనట్లు గుర్తించి శావల్యాపురం పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. నెల రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన చిమటా నాగరాజు గ్లామర్ బైకును కూడా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఇళ్ళ ముందు పార్క్ చేసిన బైకులు, పొలాలలోని పంట ఉత్పత్తులు, పొలాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్లు ఇటీవల వరుసగా చోరీలకు గురవుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే పోలీసు అధికారులు స్పందించి చోరీలకు పాల్ప డుతున్న నిందితులను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరారు.

ప్రముఖ న్యాయవాది కాయితి సైదారెడ్డి మృతి

విశాలాంధ్ర-రెంటచింతల: బీజేపీ నేత, ప్రముఖ న్యాయవాది కాయితి సైదారెడ్డి(66) గురువారం మధ్యాహ్నం గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గుంటూరులోని కోర్టులో ఓ కేస్ విషయంలో ఆయన వాదోపవాదాలు జరుపుతుండగా హృద్రోగానికి గురయ్యారు. వెంటనే చికిత్సకై ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామమైన రెంటచింతలలోని వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన ఆయన న్యాయవాద వృత్తిపై మక్కువతో గుంటూరులో ఉన్నతాభ్యాసం చేశారు. గత 32 సంవత్సరాలుగా న్యాయవాది వృత్తి కొనసాగిస్తూ నగరంలో ప్రముఖ న్యాయవాదిగా పేరొందారు. పాఠశాల పూర్వ విద్యార్థి సైదారెడ్డి అకాల మృతికి వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఏచూరి వెంకట సైదయ్య, సిబ్బంది, పలువురు గ్రామ పెద్దలు తమ సంతాపం వ్యక్తం చేశారు.

వాహనాల దొంగ అరెస్టు

విశాలాంధ్ర-మాచర్ల: ద్విచక్ర వాహనాలను చోరీకి పాల్పడుతున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ టి బాలకృష్ణ గురువారం తెలిపారు. సీఐ బాలకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ పట్టణానికి చెందిన మొగిలి నాగరాజు కొంతకాలంగా ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్నట్టు సమాచారముందన్నారు. విషయంపై నిఘా ఉంచిన టౌన్ ఎస్ఐ సౌందర్ రాజన్ నాగరాజును అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నాగరాజుతో పాటు మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, నిందితుడి నుంచి 11 లక్షల 59 వేల రూపాయల విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితుడు నాగరాజు పై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెట్టనున్నట్లు సీఐ తెలిపారు. బైకుల రికవరీకి కృషిచేసిన ఎస్ఐ సౌందర్ రాజన్ ను సీఐ బాలకృష్ణ అభినందించారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-గురజాల: పట్టణానికి చెందిన కొంగర వెంకటేశ్వర్లు గురుస్వామి గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న ప్రముఖ వైద్యులు, నియోజకవర్గ టిడిపి పార్టీ సీనియర్ నాయకుడు డా.చల్లగుండ్ల శ్రీనివాస్ గురువారం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.

అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర-వినుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపక ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జంతు శాస్త్రము బోధించుటకు ఆసక్తి కలిసిన అధ్యాపకులు సంబంధిత సబ్జెక్ట్ నందు మినిమమ్ 50శాతం మార్కులతో పి.జి. కలిగి ఉండాలన్నారు. బిఈడి కలిగిన వాళ్లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తుకు సోమవారం వరకు గడువు ఉంటుందని అదే రోజు హాజరు కావాలని పేర్కొన్నారు. 2023 మార్చి, జూన్ నెలలో జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో పాస్ అయిన విద్యార్థుల ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ కళాశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర-గురజాల: బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రతి మధ్యంతర ఉత్తర్వుల పిటిషన్లపై 20 రూపాయల స్టాంపు విడిగా అంటించాలి అని అమలు జరుపుతున్నందుకు నిరసనగా గురజాల న్యాయవాదులు గురువారం విధులకు హాజరుకారాదని తీర్మానం చేసి న్యాయవాదులు విధులను బహిష్కరించారు. విధులు బహిష్కరించిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ జానీ భాష, ఉపాధ్యక్షులు బట్టు సుందర జ్ఞానమ్మ, ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కత్తి చలమరాజు, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, కరణం కాశీ విశ్వనాథం, శానంపూడి వెంకటేశ్వర రెడ్డి, కె.వి నాగార్జున, డి అనంతరామయ్య, కొంగర హరి సత్యనారాయణ, బివి రాధాకృష్ణమూర్తి, కందిమల్ల సూర్యరాజు, కనకం ఆదినారాయణ, లింగరాజు, చీతిరాల కోటేశ్వరరావు, కర్ర చిన్న కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

దాడి ఘటనలో జైలు శిక్ష.. జరిమానా

విశాలాంధ్ర-వినుకొండ: బస్టాండ్ సెంటర్‌లో పాపులర్ ఫుట్‌వేర్ షాప్ యజమాని గంగినేని సురేష్‌ను స్వీపర్ కాలనీకి చెందిన సంపెంగుల నరసయ్య, సంపెంగుల అబ్రహం, పల్లె మరియా బాబు, సంపెంగుల దానియేలు అను నలుగురు వ్యక్తులు బీరు సీసాతో తల పగలగొట్టి, గాయపరిచి చంపుతామని బెదిరించారు. బాధితుడు వినుకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దర్యాప్తు అధికారి ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా న్యాయమూర్తి కేసు నిరూపణ కావడంతో ముద్దాయిలకు ఆరు నెలలు జైలు శిక్ష, 3 వేల రూపాయలు జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దండి వెంకటేశ్వర్లు పాల్గొనగా కోర్టు కానిస్టేబుల్ సిహెచ్ కళ్యాణ్ కుమార్ సహాయ సహకారాలు అందించారు.

నిర్మల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-వినుకొండ: గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎస్.జి.ఎఫ్ స్కూల్ గేమ్స్ అండర్ 17 విభాగంలో పొనుగుపాడులో జరిగాయి. నియోజకవర్గాలు స్థాయిలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో వినుకొండ నియోజకవర్గం మొదటి స్థానం దక్కించుకుంది. దీనిలో నిర్మల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. నిర్మల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుంచి సాయి కుమార్, రోహిత్ కుమార్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఆ విద్యార్థులను సూపరియర్ సిస్టర్ క్యాస్పర్ కరస్పాండెంట్ సిస్టర్ డెన్నిస్, హెచ్‌ఎం సిస్టర్ రాణి, చిన్ని సిస్టర్ సిస్టర్ బెనిడిక్టా సిస్టర్లు అభినందించారు. సీనియర్ వాయమ ఉపాధ్యాయులు రాధాకృష్ణ, బాల్ బ్యాడ్మింటన్ కోచ్ నాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష': మంత్రి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి నాణ్యమైన వైద్యం అందించడం ద్వారా మన రాష్ట్రం ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మనగలుగుతుందన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. గురువారం తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఆనందపేట 3వ లైనులోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని జేసీ జి.రాజకుమారి, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరిలతో కలిసి మంత్రి విడుదల రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 5,197 సురక్ష క్యాంప్‌లు నిర్వహించినట్లు చెప్పారు. 18,59,123 మందికి ఓపీ సేవలు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎవ్వరూ ఊహించని విధంగా క్యాంపుల్లో అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు సుమారు 4 నుంచి 5వేల మంది స్పెషాలిటీ వైద్యులను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. క్యాంప్‌లో 7రకాల వైద్య పరీక్షలు, 127 రకాల మందులు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జేసీ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్షకు అనూహ్య స్పందన వస్తుందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం నిర్వహించే ఇటువంటి క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి అనారోగ్య సమస్యలతో భాధపడుతున్న వారికి అవగాహన కల్పించి వారు పెద్ద ఎత్తున క్యాంప్‌లో పాల్గొనేవిధంగా చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అనారోగ్యం వస్తే ప్రైవేట్ హాస్పిటల్స్ వెళ్ళి వైద్య సేవలు చేయించుకునే పరిస్థితి లేదని, అయితే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదల ఇంటి వద్దకే అత్యుత్తమ వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. గతంలో ఇటువంటి పథకాన్ని దేశంలో ఏ సీఎం తీసుకురాలేదని, కానీ తీసుకొచ్చి అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీల, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము, డిఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, కార్పొరేటర్లు మీరావలి, ఆబీద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

విశాలాంధ్ర-నరసరావుపేట: టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ 'బాబుతో నేను' పేరిట టిడిపి నాయకులు నరసరావుపేటలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 30 రోజులుగా కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం నియోజకవర్గ కేంద్రాల్లోని దీక్షా శిబిరంలో నియోజకవర్గ మాజీ రేషన్ డీలర్లు, టీడీపీ శ్రేణుల నినాదాలతో హోరెత్తాయి. జనసేన, సీపీఐ, సీపీఎం, జై భీమ్ పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయ కులు శిబిరాల్లో పాల్గొని, 'బాబుతో నేను' బోర్డుపై సంతకాలు చేసి సంఘీభావం తెలిపారు. చంద్రబాబు జైలు నుంచి త్వరగా బయటకు రావాలని ఆకాంక్షిస్తూ, ఆలయాల్లో పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఆధారాలు లేకుండా చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారంటూ అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, మన్నాన్ షరీఫ్, బొడ్డపాటి పెరయ్య, బండారుపల్లి విశ్వేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవీంద్ర, సీపీఐ నాయకులు కాసా రాంబాబు, జాన్ సైదా, వసంత యలమంద పాల్గొన్నారు.

భూముల రీసర్వే పనుల పరిశీలన

విశాలాంధ్ర-నరసరావుపేట: లింగంగుంట్ల అగ్రహారం గ్రామ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును రెవెన్యూ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులు తర్వాత రైతులు, రెవెన్యూ పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణ నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో పార్టీని బలోపేతం చేస్తాం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి గురువారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీన, తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కత్తెర సురేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ దంపతులు లేళ్ళ అప్పిరెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే క్రమంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని సూచించారు. జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీన, సురేష్‌కుమార్ మాట్లాడుతూ లేళ్ళ అప్పిరెడ్డిని శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమించడం ద్వారా ఒక సమర్థుడైన రాజకీయ నాయకుడికి సీఎం జగన్ సముచిత స్థానం కల్పించినట్లైందని పేర్కొన్నారు.

ప్రముఖ న్యాయవాది కాయితి సైదారెడ్డి మృతి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ బిల్డింగ్ కమిటీ చైర్మన్, సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది గుంటూరుకు చెందిన కాయితి సైదారెడ్డి(65) గుండెపోటుతో మరణించారు. సైదారెడ్డి సక్షం నేత్ర సేవా సంస్థకు ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబసభ్యులు సైదారెడ్డి నేత్రాలను సంస్థకు దానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు వనమా సరేంద్ర కుమార్, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు సాంబశివరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, భీమినేనీ చంద్రశేఖర్, తోట శంకరరావు, అప్పిశెట్టి రంగారావు, నేరెళ్ల మాధవరావు, ఈమని మాధవరెడ్డి, తాడువాయి రామకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు. సైదారెడ్డి అంతిమయాత్ర శుక్రవారం ఉదయం 10:30 గంటలకు వారి స్వగృహం నుంచి టీజీపీఎస్ కాలేజీ పక్కన గోల్డెన్ హోమ్స్ అపార్ట్‌మెంట్ పట్టాభిపురం నుంచి ప్రారంభమై స్తంబాల గరువులోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

దేశంలో కులగణన జరగాల్సిన అవసరం ఉంది

విశాలాంధ్ర-గుంటూరు : దేశంలో కులగణన జరగాల్సిన అవసరం ఉందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. గుంటూరు రాజీవ్‌గాంధీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీ-20 సదస్సు గురించి గొప్పలు చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ మణిపూర్ ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారతదేశంలో సామాజిక న్యాయం కొంతమందికి మాత్రమే జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కులగణన చేస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కూడా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కులగణన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు, నగర అధ్యక్షులు షేక్ ఉస్మాన్, వణుకూరి శ్రీనివాస్ రెడ్డి, అంబటి రత్తయ్య, గద్దం పాల్ విజయ్ కుమార్, పోల్ రెడ్డి, సయ్యద్ జాని గోల్డ్, సుధీర్ బాబు, బాబురావు, మల్లవరపు చిన్న, బోడపాటి శ్రీను, గౌసియ, బాజి, కరీమ్, హద్దు, జబీర్, వాల్మీకి శ్రీనివాస్, మల్లెల మోషే, జానీ, కృష్ణ, మోహన్, వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పరిపాలన గాలికి వదిలివేసి కక్ష పూరిత చర్యలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, వైసీపీ పార్టీని బంగాళఖతంలో కలిపేందుకు ప్రజలకు సిద్ధంగా ఉన్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర హెచ్చరించారు. గురువారం పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ అధ్యక్షులు దాసరి రమణ, దాసరి జ్యోతి నేతృత్వంలో చంద్రబాబు అక్రమ అరెస్టు, బాబు ష్యూరిటీ భవిష్యత్తు కు గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంచి పెట్టటం జరిగినది. అనంతరం డివిజన్‌లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి ప్రజలకు చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రజలకు వచ్చి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించటం జరిగింది. పరిశీలకులు సింహాద్రి కనకాచారి, గొర్రెల శ్రీనివాస్ రావు, కిషోర్, నసీదా, నిర్మల, లావణ్య, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణం మండల పరిధిలో ఉన్న ఎరువులు, పురుగుమందు దుకాణాలను గురువారం పొన్నూరు మండల వ్యవసాయ అధికారి దేగల వెంకట్రామయ్య తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేసి నిర్ణయించిన ధరలకే ఎరువులను రైతులకు విక్రయించాలని హెచ్చరించారు. స్టాక్ బోర్డు, ధరల పట్టిక దుకాణం బయట ప్రదర్శించాలని సూచించారు. ప్రస్తుతానికి వరి పైరుకి కావలసిన యూరియా, పొటాష్ ఎరువులు అందుబాటులోనే ఉన్నాయన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి జిల్లా స్థాయి సదస్సులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర సమగ్రాభివృద్ధికై జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికై రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల సూచనలు స్వీకరిస్తున్నట్లు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 19న గురువారం ఉదయం 10గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలను ఆహ్వానించి కడప సమగ్రాభివృద్ధిపై చర్చా వేదికను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చర్చా వేదికను మాజీ మంత్రి డీఎల్ రంవీంద్రారెడ్డి ప్రారంభిస్తారని, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డపగారి శ్రీనివాసులు రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి గంగనపల్లి చంద్రశేఖర్, జనసేన నేత సుంకర శ్రీనివాస్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా పార్టీల నేతలు హాజరుకానున్నట్లు తెలిపారు.

పండుగ సందర్భంగా ఫ్లిప్ కార్ట్ వావ్ డీల్స్

విశాలాంధ్ర-గుంటూరు : భారతదేశంలో పండుగ సీజన్ అనేది వేడుకలకు పర్యాయపదంగా ఉంటుంది. ఇక మనలో చాలా మందికి కొత్త గాడ్జెట్లకు, ప్రధానంగా స్మార్ట్ ఫోన్ అప్‌లోడ్ కావటానికి ఇది సీజన్‌గా కూడా నిలుస్తుంటుంది. భారతదేశ స్వదేశీ ఇ-కామర్స్ గమ్యస్థానమైన ఫ్లిప్ కార్ట్ తమ వినియోగదారులకు అసాధారణమైన విలువను అందించడంలో ఎల్లప్పుడు ముందంజలో ఉంటుంది. ప్రీమియం, సరసమైన స్మార్ట్ ఫోన్ల విస్తృత ఎంపిక కోసం గో-టు డెస్టినేషన్‌గా మారింది. ఫ్లిప్ కార్ట్ తమ కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న స్మార్ట్ ఫోన్ అవసరాలను తీర్చడానికి, అనేక రకాల పరికరాలను అందించడం కోసం వివిధ రకాలైన చెల్లింపు ఎంపికలు, విక్రేతలు అందించే అద్భుతమైన డీల్లు, మొత్తంగా మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అనేక కార్యక్రమాలను చేపట్టింది. స్మార్ట్ ఫోన్ షాపింగ్ అవసరాల కోసం ఉత్తమ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, ఫ్లిప్ కార్ట్ పాత స్మార్ట్ ఫోన్లు, ఫీచర్ ఫోన్లు సహా పనిచేయని ఫోన్లకు కూడా మార్పిడి సౌకర్యం అందిస్తుంది. ఫ్లిప్ కార్ట్ తమ కొనుగోలు ప్రయాణంలో కస్టమర్ల కోసం వావ్ డీల్లను కూడా ప్రారంభిస్తోంది. ఆందోళన లేని షాపింగ్ అనుభవం కోసం ఫ్లిప్ కార్ట్ ఓపెన్ బాక్స్ డెలివరీని అందిస్తుంది.

బాక్సింగ్‌లో భజరంగ్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారుల సత్తా

విశాలాంధ్ర-తాడేపల్లి: గుంటూరు కృష్ణా జిల్లాల స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలలో తాడేపల్లికి చెందిన భజరంగ్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు పలు విభాగాలలో సత్తా చాటినట్లు అకాడమీ కార్యదర్శి, కోచ్ విష్ణు మొలకల సంఘవి గురువారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగిన జిల్లాస్థాయి అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలలో నలుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను భజరంగ్ స్పోర్ట్స్‌అండ్ ఫిట్ నెస్ అకాడమీ కార్యవర్గ సభ్యులు అభినందించి రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు.

బూజు పట్టిన భావజాలం ఇంకా వదల్లేదు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : బూజు పట్టిన భావజాలం ఇంకా మన భారతీయులను వదల్లేదని, దీంతో ఆడబిడ్డలను తక్కువగా చూడటం..వారిపై అత్యాచారాలకు పాల్పడటం జరుగుతుందని రచయిత, మహిళా సమస్యల విశ్లేషకురాలు ఏవీకె సుజాత ఆవేదన వ్యక్తంచేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'బాలికల సమస్యలు-సమాజ బాధ్యత'అనే అంశంపై గురువారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని గొప్పలు చెప్పుకుంటున్న మనం ఆడపిల్లల పట్ల వివక్ష మాత్రం పోలేదని దుయ్యబట్టారు. ఇంటి నుంచి బడికో, బయటికో వెళ్ళిన బాలిక క్షేమంగా ఇంటికి తిరిగి వస్తుందన్న నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్రాంత అధ్యాపకురాలు జయశ్రీ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్ళను ప్రపంచానికి తెలియజేయడంతో పాటు బాలికలకు సమాజ పోకడల పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం అక్టోబర్ 12న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అనేక దేశాల్లో నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, వి.జయ, గాయని సీహెచ్ రాజ్యలక్ష్మి, మాధవి, తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ముఖ్య ఉద్దేశ్యం: ఎంపీపీ

విశాలాంధ్ర-ఫిరంగిపురం: రాష్ట్ర ప్రజారోగ్యమే ముఖ్య మంత్రి జగనన్న ముఖ్య ఉద్దేశ్యమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు షేక్.షహెలానర్గీస్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేరికపూడి గ్రామంలో ఎంపిడివో దాసరి అనురాధ అధ్యక్షతనలో గురువారం సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి వైద్య శిబిరాలను, ఐసిడియస్ అంగన్‌వాడీ టీచర్స్ ఏర్పాటు చేసిన వివిధ రకాల వంటకాల పోషకాహార ఫుడ్ కోర్టును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఇంటికి కార్పోరేట్ స్థాయిలో వైకాపా ప్రభుత్వం ద్వారా కల్పించిన వైద్య సదుపాయాలను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా జడ్పిటిసి దాసరి కత్రేణమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ప్రజలకు గొప్ప వరమని ప్రజల వద్దకే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వాని బలపరచాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకున్నావారికి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళ ఎంపిపి తదితరుల చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంజుల పద్మావతి, బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ పూసపాటి నాగమల్లేశ్వరి, వెంకటరామిరెడ్డి, మునగపాడు సర్పంచ్ సాకె గోవిందు, నుదురుపాడు సర్పంచ్ జి.చౌదయ్య, ఎంపిటిసిలు సాలె నాగరాజు, కాశీం షహీద్, వైకాపా నాయకులు పెరికల మరియబాబు, బాపూజీరెడ్డి, ఇందూరి శ్రీనివాసరెడ్డి, షేక్. సలీమ్, తహశీల్దార్ డి.పద్మనాభుడు, ఇవోపి ఆర్డి ఎఎన్ఎల్. కుమారి, వైద్యులు ఫరీనాబేగం, యానీ గ్రేస్, బ్యూలా, ఐసిడియస్ సిడిపివో ప్రసూనా, సెక్రటరి విష్ణువర్ధన్‌రావు తదితర వైకాపా నాయకులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు, ఎఎన్‌యంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టం అమలులో రాష్ట్రం మూడో స్థానం

విశాలాంధ్ర-నరసరావుపేట: సమాచార హక్కు చట్టం అమలు చేయడంలో దేశంలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానంలో వుందని, మహారాష్ట్ర చిట్ట చివరి స్థానంలో నిలిచిందని రాష్ట్ర సమాచార కమిషనర్ ఉల్లాల హరిప్రసాద రెడ్డి చెప్పారు. అక్టోబర్ 12 వ తేదీ ఆర్టీఐ దినోత్సవం సందర్భంగా నరసరావుపేట టౌన్ హాల్‌లో గురువారం జరిగిన ఆర్టీఐ నేషనల్ సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరై కమిషనర్ ప్రసంగించారు. అధికారులు ఎప్పటి రికా ర్డులు అప్పుడు పూర్తి చేసుకొంటే సహా చట్టం ప్రకారం సమాచారం ఇవ్వటం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద సహచట్టం బోర్డుకు ఏర్పాటు చేయా లని, అలా చేయని చోట అధికారులే స్వచ్ఛందంగా ఏర్పాటుకు ముందుకు రావాలని, ఇంకాబోర్డులు పెట్టని కార్యాలయాల వివరాలు రాష్ట్ర కమిషన్ కార్యాలయంలో తెలిపితే వెంటనే ఏర్పాటు చేస్తామని వివరించారు. తొలుత స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద ఆర్టీఐ శ్రేణులు, అధికారులు, విద్యార్థులతో జరిగిన ర్యాలీనీ ప్రారంభించి పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి మంత్రి సంతాపం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మండల పరిధిలోని పెద్దమక్కెన గ్రామంలో వైసీపీ నాయకులు ఉడుముల సుబ్బారెడ్డి అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు అంబటి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని తెలిపారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి అంబటితో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

బీవీ నాగేశ్వరరావుకు సన్మానం

విశాలాంధ్ర-వినుకొండ: సాయిరాం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో గురువారం వినుకొండ జాషువా కళా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు మరియు వెంకాయమ్మ దంపతులను సేవారత్న అవార్డుతో ఘనంగా సన్మానించారు. కరోనా సమయంలో ప్రైవేటు స్కూల్ టీచర్లకు 13 విడతలుగా 50 లక్షలు విలువైన రైస్ బాగ్స్ నిత్యావసర వస్తువులు మరియు కూరగాయలు పంపిణీ చేసినందుకు, ఈ అవార్డు కలెక్టర్ బి.వి. నాగేశ్వరరావు మాస్టారును దుశ్శాలువ,పూలమాల,అవార్డుకు సంబంధించిన జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

బ్యాడ్మింటన్‌లో దుర్గి విద్యార్థులు ప్రథమ స్థానం

విశాలాంధ్ర-దుర్గి: పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పొనుగుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జరిగిన అండర్ 14 బాలుర విభాగంలో బాల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ కం. సెలక్షన్స్ నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంటులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దుర్గి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన టీం నుండి 8వ తరగతి ఇద్దరు విద్యార్థులు మంద మత్తయ్య, అందుగుల దాసులు శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో పాల్గొనుటకు స్థానం సంపాదించారు. జిల్లాస్థాయి విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో స్థానం సాధించిన విద్యార్థులను గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.కోటేశ్వరమ్మ, దుర్గి 2వ మండల విద్యాశాఖ అధికారి 2 డి.బెంజిమెన్, ఎస్ఎంసి సభ్యులు తోటకూర వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బండ్ల ప్రసాద్ కృషిని పలువురు అభినందించారు.

ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై భారాలు

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రూఅప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటు చార్జీలు పేరిట విద్యుత్ బిల్లుల్లో అదనపు భారాలు వేస్తున్నారని సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీకాంత్ తెలిపారు. వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియం వద్ద విద్యుత్ భారాలపై ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి, నళినీకాంత్‌లు మాట్లాడుతూ గతంలో బిల్లులు చెల్లించినా ట్రూ అప్, సర్దుబాటు పేరిట మరోసారి ప్రజలపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. కరెంట్ బిల్లులపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ప్రభుత్వం విద్యుత్ బిల్లులపై పునరాలోచించి అదనపు భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఓ వైపు సతమతమవుతుంటే మరో వైపు విద్యుత్ బిల్లు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, నూతలపాటి చిన్న, సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నగర కమిటీ సభ్యులు లక్కా అరుణ, షేక్ ఖాశిం షహీద్, ఎస్.కార్తీక్, షేక్ ఖాశిం వలి, నాయకులు టి.రాధ, వాసు, టి.శ్రీనివాసరావు, బాషా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్ట్‌పై నిరసనగా ప్రజా చైతన్య యాత్ర

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఫిరంగిపురం మండల నాయకులు బాబుతో నేను కార్యక్రమంపై ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణకుమార్ మాట్లాడుతూ కక్ష సాధింపుల కోసం అన్యాయంగా అరెస్ట్‌లు చేయించి దోపిడీ పాలన సాగిస్తున్న వైకాపా ప్రభుత్వానికి త్వరలో ముగింపు జరుగుతుందని ఆరోపించారు. చంద్రబాబు నాయుడుపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించారని ప్రజలు అన్ని గమనిస్తున్నారని శ్రావణకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు నర్సింహారావు, కొత్తపల్లి కోటేశ్వరావు, సంపతి నాగేశ్వరావు, పున్నారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, అప్పారావు, రత్నరాజు, సీతారామరాజు తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

విశాలాంధ్ర-పర్చూరు: ఉపాధ్యాయుల జనరల్ అంతర జిల్లా బదిలీలు జరపాలని హిందీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.హను మంతరావు తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒక చోట, వారి తల్లిదండ్రులు మరొకచోట నివాసం ఉండటం వలన ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని, ప్రభుత్వం స్పందించి బదిలీలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

మనోవేదనతో 'మువ్వా' మృతి

విశాలాంధ్ర-పర్చూరు: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌తో మనోవేదనకు గురైన చిననందిపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మువ్వా సింగారావు మృతిచెందాడు. బాబుకు బెయిల్ రాకపోవటంతో తీవ్రంగా కలత చెందాడు. వేదనతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. టీడీపీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకే ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-అద్దంకి ; ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు.గురువారం మండలంలోని నాగులపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిభిరాన్ని కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈసందర్భముగా కృష్ణచైతన్య మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతదన్నారు.దీర్ఘకాలిక రోగాలతో ఇబ్బంది పడుతున్న వారితో పాటు అందరికీ వైద్య పరీక్షలు చేయడం వల్ల వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని భవిష్యత్తులో ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.గ్రామంలో నూతనంగా నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కృష్ణచైతన్య ప్రారంభించారు.

బాబు అరెస్టును నిరసిస్తూ సైకిల్ యాత్ర

విశాలాంధ్ర-అద్దంకి; తెలుగు దేశంపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ జె.పంగులూరు మండల తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో గురువారం అలవలపాడు గ్రామం నుండి చందలూరు వరకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో తెదేపా శ్రేణులు భారీ సైకిల్ యాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ 9 కిలోమీటర్లు సైకిల్ తొక్కి యాత్రలో పాల్గొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా నియోజకవర్గ మండల కేంద్రాల్లో సైకిల్ యాత్ర చేపట్టామని ఆయన తెలిపారు.

పాఠశాలకు క్రీడా స్తంభాల వితరణ

విశాలాంధ్ర-అద్దంకి ; పుట్టంరాజు బుల్లెయ్య రామ లక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక కాకాని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం దండీలు తీయడానికి అవసరమైన జింక్ బార్స్, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్ ఆటలకు కావలసిన ఆరువేల రూపాయల విలువైన జింక్ స్తంభాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురవయ్య,యం.ఇ.వో-2 బి,సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సృజన హాస్పిటల్‌లో బాలింత మృతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలో సృజన హాస్పిటల్ బాలింత మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు కాకుమాను మండలం బీకేపాలెంకు చెందిన కొండ్రు దానియేలు తన భార్య మరియమ్మను ప్రసవం కోసం ఆసుపత్రికి తీసుకురాగా ఆపరేషన్ చేసి మగ బిడ్డను బయటకు తీశారు. అనంతరం మరియమ్మకు సైలెన్ పెట్టిన కొంత సమయానికే మరియమ్మ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పుట్టిన బిడ్డ కళ్లు తెరవక ముందే జన్మనిచ్చిన తల్లి మృతిచెందటంపై చూపరులను కంటతడి పెట్టించింది. వైద్యులు నిర్లక్ష్యం వల్లే మరియమ్మ చనిపోయిందని కుటుంబీకులు మండిపడ్డారు.

కక్షసాధింపుతోనే చంద్రబాబు అరెస్టు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : వైకాపా అరాచక పాలన గురించి, అసమర్థ విధానాల గురించి ప్రజలకు వివరిస్తున్న చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అరెస్టు చేసి జైలుకు తరలించారని తెదేపా యువనేత ఎం.గౌరీ అమర్నాథ్ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుపై నియోజకవర్గ ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య ఆదేశానుసారం కొత్తపేటలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మధు, జనార్ధన్ రావు,గజవల్లి శ్రీనివాసరావు,వెంకటేశ్వర్లు, సురేష్, నాగేశ్వరరావు, ఆనంద్, తిరుపతి రాయుడు, చైతన్య, వెంకటేష్, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

విశాలాంధ్ర - బాపట్ల : ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పర్చూరు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ముద్దాయి పల్నాడు జిల్లా చిలకలూరిపేట, రూత్ డెక్ మెన్ కాలనీకి చెందిన పోతురాజు వీర బాబు గా గుర్తించినట్లు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పర్చూరు ఎం.పి.డి.ఓ కార్యాలయం ఎదురుగా నిలిపిన ద్విచక్ర వాహనం కనిపించడం లేదని 2023 అక్టోబర్ 05 న వచ్చిన ఫిర్యాదు మేరకు పర్చూరు ఎస్సై కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పి వెంకటేశుల సూచనలతో మార్టూరు సిఐ ఫిరోజ్ నిఘా ఏర్పాటు చేశారు. పర్చూరు ఎస్సై ప్రసాద్ సారధ్యంలో ప్రత్యేక టీం ను ఏర్పాటు చేశారు. పట్టణం లోని సీసీ కెమెరాలు పరిశీలించి, సాక్షులు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముద్దాయిని గుర్తించారు. అతనిపై ప్రత్యేకమైన నిఘా ఉంచగా గురువారం ఉదయం 08.30 గంటలకు పర్చూరు వై జంక్షన్ నందు ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ముద్దాయి పోలీసు లను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడని తెలిపారు. ఎస్ఐ తన సిబ్బంది సహాయముతో చాకచక్యంగా పారిపోతున్న వ్యక్తి ని పట్టుకొని విచారించటంతో బైకు దొంగతనం చేసినట్లుగా అంగీకరించినట్లు తెలిపారు. నింధితుని వద్ద నుండి 6 ద్విచక్ర వాహనాలను స్వాధీన పరచుకొని ముద్దాయిని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు.

చోరీ కాబడిన ద్విచక్ర వాహనాలను రికవరీ చెయ్యడంలో ప్రతిభ కనపరిచిన మార్టూరు సిఐ ఫిరోజ్ పర్చూరు ఎస్ఐ ప్రసాద్ ను సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిలిపివేయాలి : వామపక్షాలు

విశాలాంధ్ర - రేపల్లె : స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి విద్యుత్ వినియోగదారులు, రైతులపై పెను భారాలను మోపాలనే ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలని వామపక్ష పార్టీల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వామపక్ష పార్టీలు ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) పార్టీలు నిర్వహిస్తున్న ప్రచార ఆందోళన కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. గురు వారం భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, పెద్దపులి వర్రు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనే యులు, సీపీఎం రైతు సంఘం నాయకులు కె.రామ స్వామి, సిపిఐ (ఎంఎల్) నాయకులు మర్రివాడ వెంకట్రా వులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించా లని ఆందోళన నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల కళ్ళుగప్పి దొడ్డిదారిన సర్దు బాటు ఛార్జీల భారాన్ని మోపారని విమర్శించారు. రాష్ట్రం లోని వైసీపీ ప్రభుత్వం సామాన్యులను దోచి కార్పొరేట్ శక్తుల జేబులు నింపుతుందని మండిపడ్డారు. వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో 25 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించేవరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మురు గుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, సీపీఐ (ఎంఎల్) నాయకులు సీతారామయ్య, జగ్గారపు కోటేశ్వర రావు, సీపీఐ నాయకులు బందారు శ్రీనివాసరావు, గొట్టుముక్కల బాలాజీ, ప్రజా సంఘాల నాయకులు పి.శ్రీకాంత్,అమర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు: కలెక్టర్

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని చల్లారెడ్డిపాలెంలో జగనన్న కాలనీల్లో గృహ మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి విడతలో 5 లక్షల గృహాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఆ మేరకు జిల్లాలో గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో సుమారు 50 వేల గృహాలను నిర్మించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. చల్లారెడ్డిపాలెం గ్రామంలో జగనన్న కాలనీలో 8.26 ఎకరాల భూమిలో 213 గృహాలను మంజూరు చేసి 203 గృహాలను పూర్తి చేసి ప్రారంభించామన్నారు. జగనన్న కాలనీ పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జగనన్న కాలనీలో కల్వర్ట్ అంతర్గత రోడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మంచి పరిపాలన కోసం ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వాన్నికి మద్దతుగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో పేద అక్కా చెల్లెమ్మల కోసం 10 లక్షల గృహాలను నిర్మించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 5 లక్షల మందికి గృహాలను మంజూరు చేశారన్నారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాలు ఉపయోగించుకుని జగనన్న కాలనీ సుందరంగా నిర్మించుకోవడం జరిగిందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం వల్ల జగనన్న కాలనీ సకాలంలో పూర్తి చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో ఇదే విధంగా కలిసి కట్టుగా అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు. జగనన్న కాలనీ ప్రారంభోత్సవం సందర్భంగా కాలనీ నిర్మాణానికి అభివృద్ధి కృషి చేసిన అధికారులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జీ కరణం వెంకటేష్, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, ఎం.ఆర్.ఓ అశోక్ వర్ధన్, ఎంపీడీఓ రూతమ్మ, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండల పరిధిలోని పెద్ద అంబడిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును చైతన్య పరిశీలించారు.ఈ సందర్భంగా చైతన్య ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు,వైద్య పరీక్షల వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.చైతన్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటూ ప్రజల వద్దకే పరిపాలన వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. ఈ క్యాంపు ద్వారా 351 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చింతల పేరయ్య,గ్రామ సర్పంచి ఎం.కుసుమ కుమారి,ఎంపీడీవో సి.హెచ్ కృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్.శ్రీనువలి, మండల వైద్యఅధికారులు రమీజు అహ్మద్,భారతి,సౌజన్య వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ చీరాల డివిజన్ ఎం.టీ భారతి అన్నారు.మండలంలోని కాపూరివారిపాలెం పంచాయితీలో ప్రకృతి వ్యవసాయ చీరాల డివిజన్ ఎం.టీ భారతి ఆధ్వర్యంలో మల్లెపూల తోటల రైతులకు జీవామృతం తయారుచేయు విధానాన్ని నేర్పించారు. 100 లీటర్ల నీటిలో 5 కేజీల ఆవు పేడ, ఐదు లీటర్ల ఆవు మూత్రము, ఒక కేజీ బెల్లం, ఒక కేజీ శనగపిండి, కలిపి మూడు రోజులు తర్వాత మొక్కలకు వాడవలెనన్నారు. గన్నుల ద్వారా కూడా స్ప్రే చేయవచ్చునన్నారు. ఇందువలన మొక్కలు బాగా పెరిగి తెగుళ్లను తట్టుకోగలుగుతాయన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభం సాధించవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాపూరి రమణారెడ్డి,ఐ.సి.పి.ఆర్‌లు కవిత,శిరీష, స్వరూప, ఆర్బికే అధికారిణి ఏమేలియా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కారు ద్విచక్ర వాహనం ఢీ.. ఇరువురి మృతి

విశాలాంధ్ర - మార్టూరు : కారు ద్విచక్ర వాహనం ఢీకొని ఇరువురు దుర్మరణం చెందిన సంఘటన స్థానిక స్టోన్ కసర్ల వద్ద చోటు చేసుకుంది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ భాషా (50) మార్టూరు బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో పోతారం వెళ్తుండగా స్థానిక స్టోన్ కసర్ల వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న మరో గుర్తు తెలియని వ్యక్తి కారును ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు కారు అద్దాలు పగలగొట్టుకొని వచ్చి కారులో ప్రయాణిస్తున్న ఖాదర్ భాషా బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.ద్విచక్ర వాహనాలు దారుడికి రెండు కాళ్లు రెండు చేతులు తీవ్ర గాయాల ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ద్విచక్ర వాహనదారుని వివరాలు తెలియాల్సి ఉంది.సమాచారం తెలుసుకున్న ఎస్సై కమలాకర్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు : కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు కులం, మతం, వర్గం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని శాపునెట్ చైర్మన్ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు.గురువారం మండల పరిధిలోని చెన్నుపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ,కరపత్రాలు పంపిణీ చేశారు.సంక్షేమ పథకాల అందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు.గడిచిన నాలుగున్నర సంవత్సరంలో అర్హతను బట్టి ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయలు నుండి 10 లక్షల రూపాయల వరకు నేరుగా వారి ఖాతాలో జమ చేశారన్నారు.ప్రజలు ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగే పని లేకుండా ప్రజల గడప వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.ప్రజా సంక్షేమం కోసం పరితపించే నాయకుడు రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి,దివ్య రామాంజనేయులు,టీ.నరేష్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలి,షేక్ మీరావాలి,పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లు వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పవన్ మెరుపు తీగ రాజకీయాలు మానుకో

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చంద్రబాబు దత్తపుత్రుడు ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ మెరుపుతీగ రాజకీయాలు మానుకోవాలని వైసీపీ దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య హితవు పలికారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామయ్య మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కి మూడు రోజులు నుంచి రాష్ట్రంలో ప్రజలకు కనిపించటం లేదన్నారు. బాపట్ల జిల్లా సాధకుడు బాపట్ల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతిపై జనసేన,టిడిపి నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. 2024లో భారీ మెజారిటీతో మూడోసారి ఎమ్మెల్యేగా కోన రఘుపతిని గెలిపించుకుంటామన్నారు.సూర్యలంక బీచ్ అభివృద్ధి, పట్టణానికి దగ్గరగా నేషనల్ హైవేను తీసుకువచ్చారని రామయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ దివ్యాంగుల నాయకులు అచ్యుత ఏడుకొండలు,ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, చెరుకుపల్లి ప్రభుదాస్, మోటుకూరి శ్రీనివాసరావు,దూల కృష్ణారెడ్డి, అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎండిపోతున్న పంటలు: వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : వైసీపీ ప్రభుత్వంలో సకాలంలో కాలువలకు సాగునీరు రాకపోవడంతో పంట పొలాలు ఎండిపోతున్నాయని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల మండలం మురకుండపాడు గ్రామంలోని పంట పొలాలను బుధవారం పార్టీ నాయకులతో కలసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి రైతు నేడు వైసిపి ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వేలు పెట్టుబడి పెట్టిన రైతులు సాగునీరు రాకపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక రైతులు ఆత్మహత్యే శరణ్యమంటూ ఆవేదన చెందుతున్నరన్నారు. ఇప్పటికే వరి నారుమడులు పోసిన వందలాది ఎకరాలు, అదే విధంగా వరి పంట వేసిన పంట పొలాలకు నీరు అందక ఎండిపోతున్న పరిస్థితి కూడా అన్నదాతల్లో కలవరపెడుతుందన్నారు. నారుమడులు వేసి 45 రోజులు దాటినా సాగునీరు అందకపోవడంతో పంట భూమి బీటలుబారిందన్నారు. ఎండిన పంట పొలంలో కలుపు రాకపోవడంతో ఎకరానికి 50 మంది కూలీలను ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు.గత ప్రభుత్వ హయాంలో సాగునీటి కాలువలు,మురుగు కాలువలు మరమ్మతులు చేసేవారని నేడు వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత నాలుగు సంవత్సరాల నుంచి సాగునీటి కాలువలు ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో కాల్వలు చాలా అధ్వానంగా ఉన్నాయన్నారు. రైతులకు ఇబ్బంది రాకూడదనే ఆలోచనతో చంద్రబాబు గత ప్రభుత్వంలో పట్టిసీమ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని ఉద్దేశ్యంతో ఏర్పాటు చేస్తే నేడు పట్టిసీమ ద్వారా నీరు విడుదల చేయడానికి వైసిపి ప్రభుత్వం సిగ్గుపడి సాగునీరు అందించకుండా రైతులను ఇబ్బంది పెడుతుందన్నారు.దార్శనికత, ముందు చూపు ఉన్న వ్యక్తి చంద్రబాబు అన్నారు. పాలన అనుభవం లేని జగన్మోహన్ రెడ్డికి ఉన్న తేడా ఇదేనని అన్నారు. ఇరిగేషన్ శాఖ, ఎమ్మెల్యే కోన రఘుపతి ఇకనైనా నిర్లక్ష్యం వీడి సమస్య తీవ్రతను గుర్తించి నియోజకవర్గంలో అన్ని సాగునీటి కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేసి ప్రతి ఎకరాకు నీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : వరి పంటలో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సత్యానంద్ సూచించారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామం నందు గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ), జిల్లా వనరుల కేంద్రం బాపట్ల వారి సౌజన్యంతో వరి పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతపు ఖరీఫ్ 2023 సీజన్లో 11 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేస్తున్నారని, ప్రధానంగా ఆకు చుట్టు పురుగు, పాము పొడతెగులు, దోమపోటు బెడద ఎక్కువగా ఉన్నదని తెలిపారు.ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఓబయ్య మాట్లాడుతూ రసాయనిక పురుగు మందులను వాడేటప్పుడు రైతులు గుర్తుంచుకోవలసినది తక్కువ తీవ్రత నుంచి ఎక్కువ తీవ్రత కలిగిన మందులను వాడాలని చెప్పారు.ఆకు చుట్టు పురుగు నివారణకు క్లోరాంట్రా నిలిప్రోలు 0.3 ఎంఎల్‌గాని లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 3 గ్రాములుగాని లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినచో సత్ఫలితాలు పొందవచ్చు అని తెలిపారు.పాము పొడ తెగులుకు హెక్సాకొనజోల్ ఒక లీటర్‌కి 2 ఎంఎల్ చొప్పున పిచికారి చేయాలని సూచించారు.డిడిఏ విజయనిర్మల మాట్లాడుతూ వేప ఆధారిత ఉత్పత్తులను వాడినచో క్రిమి కీటకాలు సమర్థవంతంగా నిర్మూలించబడతాయని, దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.ఏడిఏ లక్ష్మీ మాట్లాడుతూ ఎరువులను ఇప్పటివరకు కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచామని, భవిష్యత్తులో కూడా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వాటి ఆధారంగానే రసాయన ఎరువుల వాడకం ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రసన్న రాజు, ఏ.ఈ.ఓలు శేషమ్మ, పావని, సుదర్శన రావు, వివిఏ షాలెంరాజు, జాన్ రాజు, ప్రసాద్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటివద్దకే వైద్యసేవలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని నియోజకవర్గ వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. మండలంలోని వాడ రేవు సచివాలయం 1 పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా పెద్ద ఆసుపత్రులలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీ.ఐ.ఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నేతాజీ, ఆసాది అంకాలరెడ్డి, కాపూరి రమణారెడ్డి, బుర్ల సాంబశివరావు, ఎరిపల్లి రమణ, అక్కల శ్రీనివాసరెడ్డి, మచ్చా సువార్త, గడ్డం శ్రీను, మారుపోయిన ప్రేమ్ చంద్, చావాలి వాసు, పిక్కి నారాయణ, చేపల గాలి, నర్రా బ్రహ్మయ్య, రాజబాబు, సచివాలయం సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమూరులో 'జగనన్నకు చెబుదాం'

విశాలాంధ్ర - వేమూరు : నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు.మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రంజిత్ భాష పాల్గొంటారని, వేమూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు జిల్లా కలెక్టరుకు నివేదించుకొని వాటి పరిష్కారం పొందాలని ఎంపీడీవో తెలియజేశారు. అన్ని శాఖలకు సంబంధించిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు, మండల శాఖ అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆటల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర - చీరాల : విద్యార్థులు చదువుతో పాటు అటలలో కూడా రాణించాలని,ఆటలు శరీర దారుఢ్యానికి,మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని వైస్సార్సీపీ ఇంచార్జి కరణం వెంకటేష్ అన్నారు.ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి బాల,బాలికల అండర్14,17 స్కూల్ గేమ్స్ వాడరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పంగులూరి సుధారాణి మాట్లాడుతూ బాల బాలికలకు ఉత్తమ శిక్షణనిచ్చిన వ్యాయమ ఉపాధ్యాయులైన నాశన రవీంద్ర బాబు, పాపనబోయిన నరేష్‌లను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు అటలలో కూడా రాణించి పాఠశాలకు,తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు.అనంతరం అండర్ 17కి ఎంపికైన మైలపల్లి సోమేశ్, చింతా శామ్యూల్, అండర్ 14కి ఎంపికైన రాజేష్, కొవ్వూరు నూకరాజు,మహేష్, బాలికల విభాగంలో పిక్కి రత్న దీపిక, యర్రంశెట్టి సంజుల, చింతా మేరీ కీర్తనలను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు దేవి ఎంపిక

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చేవూరు దేవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.కవిత తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినికి రాష్ట్రస్థాయి జట్టులో కూడా చోటు లభించడం అభినందనీయమన్నారు. జిల్లాలో వలెనే రాష్ట్రస్థాయిలో కూడా నైపుణ్యం కనపరిచి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తేవాలని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్ అన్నారు.దేవిని పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

స.హ. చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలు అధికార యంత్రాంగం జవాబుదారీతనాన్ని రాబట్టాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జోనాథన్ పిలుపునిచ్చారు. గురువారం సహచట్ట ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఇన్చార్జి ఏ.డి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో జోనాథాన్ మాట్లాడుతూ సహ చట్టం ద్వారా పాలనలో పారదర్శకత సిద్ధిస్తుందన్నారు.సహ చట్టం సామాన్యుడిని సాధికారిగ చేస్తుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అధికారం కూడా ప్రజలకు ఉందని ఆయన వివరించారు.ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి సాయిబాబు మాట్లాడుతూ సహ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు.ఈ చట్టం అటకెక్కకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆచార్య లాల్ అహ్మద్, కోటేశ్వరరావు,బాలాజిరెడ్డి, డేవిడ్ రాజు, రాజారావు,చిత్రకారుడు జీవీ,ప్రసన్నంజనేయులు, అర్జున్,గురజాల శ్రీనివాస రావు ,శేఖర్, దేవవరం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకటన

తెనాలి డి. రేపల్లె సబ్ డి. యిలాకా రేవల్లె మున్సిపల్ 17వ వార్డు, 34వ బ్లాకు నందలి రేపల్లె మున్సిపల్ డోర్ నెం.8-34-27రుకు దూరమునగల ఇసుకపల్లి **డి.నెం. 44రు య.109ట్లులో** నాకు హక్కుగలిగి **పడ్డి తాతారావు** కుమారుడు **ప్రకాష్‌**కు చెందిన 219 చ॥గ॥ల ఖాళీ నివేశన స్థలముకు హద్దులు

తూర్పు : అయోవా గరల్స్ హైస్కూల్ కాంపౌండ్ గోడ హద్దు 31.960 అ॥లు

దక్షిణం : సోమిశెట్టి సుబ్బారావు గారి స్థలం హద్దు 63.9 అ॥లు, **పడమర** : 8 అ౹౹ల వెడల్పు గల దారి హద్దు 31 అ॥లు

ఉత్తరం : కందుల కనకరత్నంగారి స్థలం కొంత, సర్కారురోడ్డు కొంతహద్దు 61.6 అ॥లు. ఈ హద్దుల మధ్య 219 చ॥గ॥లు అక్షరాల రెండు వందల పంతొమ్మిది చదరపు గజములుకు సరియగు 183.96 ॥ మీ॥ర్లు ఖాళీ నివేశన స్థలం మాత్రం.

పైన షెడ్యూల్‌లో చెప్పబడిన స్థిరాస్తికి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో తెలియజేయగలరు. ఆ తదుపరి ఈ స్థలమునకు సంబంధించి ఎటువంటి సివిల్ కేసులు వేసినా చెల్లవని తెలియజేస్తున్నాను.

ముత్తపరపు స్వతంత్ర తేజ్ కుమార్
సెల్ : +919866334644